క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మెట్టు

బొమ్మనహాళ్‌: వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రతాప్‌రెడ్డిని నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి నాయకులు మంగళవారం పరామర్శించారు. ప్రతాప్‌రెడ్డి తల్లి అమ్మిరెడ్డి అనంతమ్మ (78) అనారోగ్యంతో మృతి చెందారు. సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, నాయకులు పయ్యావుల సత్యన్న, సూర్యప్రతాప్‌రెడ్డి, డాక్టర్‌ బసప్ప, ఫొటో బసవరాజు, మెట్టు హనుమంతరెడ్డి, దేవరెడ్డి, కోటేశ్వరరెడ్డి, తదితరులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

శెట్టూరు:మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎస్‌ఐ రాంభూపాల్‌ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏఎఫ్‌ ఎకాలజీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సమాజంలో మహిళల వివక్షతపై పాటలు పాడివినిపించారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళలు నేడు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, లింగ వివక్ష, వివేధం చట్టరీత్యానేరమన్నారు. ఎస్‌ఐ మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎఫ్‌ ఎకాలజీ సిబ్బంది ప్రాజెక్టు డైరెక్టర్‌ హనుమంతరాయుడు, కోఆర్డినేటర్‌ రుద్రయ్య, ఏఎల్‌పీ కోఆర్డినేటర్‌ రిజ్వాన తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అజాగ్రత్త తగదు



గంజికుంటలో గాలికుంటు వ్యాధి టీకా వేస్తున్న పశువైద్యశాఖ డీడీ వెంకటేష్‌

వజ్రకరూరు: పశువులకు సోకే వ్యాధులపై అజాగ్రత్తగా ఉండరాదని ఉరవకొండ డివిజన్‌ పశు వైద్య డిప్యూటీ డైరెక్టర్‌ జి.వెంకటేష్‌ సూచించారు. మంగళవారం గంజికుంటలో ఎఫ్‌ఎండీ (గాలికుంటు వ్యాధి టీకా) వ్యాక్సినేషన్‌పై స్పెషల్‌ డ్రైవ్‌ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ నాలుగునెలల వయసు నుంచి ఉన్న ఆవులు, దూడలు, గేదెలు, ఎద్దుల తదితర వాటిని గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి క్రిష్ణమూర్తినాయక్‌, జేవీఓ భద్రునాయక్‌, వెటర్నరీ అసిస్టెంట్లు జూబా, వెంకటేష్‌, రఫీ,పెన్నోబులేసు తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



తాళ్లకెర సమీపంలో అక్రమంగా ఇసుకను నిల్వ చేసిన దృశ్యం

గుమ్మఘట్ట: మండలంలో ఇసుక వ్యాపారం జోరుగా సాగుతుంది. అధికార పార్టీ నాయకులు వేదావతి హగరి పరీవాహక ప్రాంతం నుంచి పగటి వేళల్లో ఇసుకను ట్రాక్టర్లతో ఒక చోట డంప్‌ చేసి, రాత్రివేళల్లో టిప్పర్ల ద్వారా కర్ణాటకకు తరలిస్తూ, అక్రమార్జన చేస్తున్నారు. తాళ్లకెర,బీటీపీ, కోనాపురం, సిరిగెదొడ్డి గ్రామాల పరిధిలో ఇసుకను డంప్‌ చేసుకొని సరిహద్దున ఉన్న కర్ణాటకకు యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఇటీవల తాళ్లకెర సమీపంలో ఇసుకను తెలుగు తమ్ముళ్లు కర్ణాటకకు తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. వారం తిరగక మునుపే ట్రాక్టర్లను పోలీసులు వదలివేయడంతో మళ్లీ టీడీపీ నాయకులు ఇసుక వ్యాపారాన్ని జోరుగా చేస్తున్నారు. ఈ విషయంపై రూరల్‌ సీఐ వెంకటరమణను అడగ్గా కర్ణాటకకు అక్రమంగా ఇసుకను తరలిస్తే తప్పకుండా చర్యలు చేపడతామన్నారు. ఇసుక నిల్వలు ఉంటే ముందస్తుగా సమాచారం ఇవ్వాలన్నారు.

వెల్ఫేర్‌ అసిస్టెంట్‌కు సన్మానం



వెంకట నారాయణను సన్మానిస్తున్న ఆర్డీఓ వసంతబాబు, డీఎస్పీ రవిబాబు

కళ్యాణదుర్గం: ఎస్సీ,ఎస్టీలకు అట్రాసిటీ చట్టాలపై అవగాహన కల్పించి చైతన్యం తీసుకొచ్చినందుకు బెళుగుప్ప మండలం హనిమిరెడ్డిపల్లి సచివాలయ వెల్ఫేర్‌ అసిస్టెంట్‌ వెంకటనారాయణను అధికారులు సన్మానించారు. మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ వసంతబాబు, డీఎస్పీ రవిబాబులతో పాటు ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్‌ కమిటీ సభ్యులు రామాంజనే యులు, మోహన్‌, హరీష్‌, ఎంపీపీలు మా రు తమ్మ, భవానిలు జ్ఞాపికను అందజేసి, సన్మానించారు.

బాబు ష్యూరిటీ.. ఏదీ గ్యారెంటీ?



- 'సూపర్‌సిక్స్‌'పైనా నోరు మెదపని సర్కారు
- నిరుద్యోగుల ఆశలపై నీళ్లుచల్లిన ప్రభుత్వం
- అటకెక్కిన రూ.3 వేల నిరుద్యోగ భృతి
- జాడ లేని జాబ్‌ క్యాలెండర్‌
- ప్రభుత్వంపై భగ్గుమంటున్న నిరుద్యోగ యువత
- నేడు యువతపోరుకు సిద్ధమైన యువతీయువకులు

రాయదుర్గం/రాయదుర్గం టౌన్‌: సార్వత్రిక ఎన్నికలప్పుడు జాబు కావాలంటే బాబు రావాలన్నారు..ఏటా జనవరి 1న జాబ్‌క్యాలెండర్‌ విడుదల చేస్తామన్నారు.. 20 లక్షల ఉద్యోగాలు, రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు.. పరిశ్రమలు తేవడం, వర్క్‌ఫ్రం హోం కోసం హైటెక్‌ టవర్లు కడుతామన్నారు.. అధికారంలోకొచ్చిన తర్వాత అన్నీ మర్చిపోయారు. నెలలు గడుస్తున్నా.. బాబు ష్యూరిటీ లేదు.. భవిష్యత్‌కు గ్యారెంటీ లేదని యువత, నిరుద్యోగులు నిట్టూరుస్తున్నారు. సీఎం చంద్రబాబు మొదలు డిప్యూటీ సీఎం పవన్‌ కళ్యాణ్‌, మంత్రులు, ఎమ్మెల్యేల వరకు సూపర్‌ సిక్స్‌ పథకాలు అమలు చేస్తామని చెప్పి.. ఏ ఒక్కటీ ఇచ్చిన దాఖలు లేవని ఊరూరా విమర్శిస్తున్నారు. నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లిన కూటమి ప్రభుత్వంపై నిరుద్యోగులు, యువత బుధవారం యువత పోరుకు సిద్ధమయ్యారు.

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని 1,77,344 మంది నిరుద్యోగులు ఉన్నారు. వీరందరికీ రూ.3 వేలు భృతి ఇవ్వాల్సి వస్తే రూ.53.20 కోట్లు ప్రతి నెలా ప్రభుత్వం వారి ఖాతాల్లో జమ చేయాలి. అయితే గత రెండు బడ్జెట్‌ సమావేశాల్లోనూ పైసా కేటాయించకపోవడం విమర్శలకు తావిస్తోంది. జిల్లాలో పీజీ, ఎంటెక్‌ చేసిన వారు 78 వేలు, డిగ్రీ, బీటెక్‌ చదివిన వారు 1.62 లక్షలు, టీటీసీ చేసిన వారు 28,800, ఐటీఐ, డిప్లొమా 51 వేలు, ఇతరాత్ర విద్యార్హతలున్న వారు 2,10 లక్షలు, మొత్తం నిరుద్యోగులు 5,29,800 మంది ఉన్నారు. వీరందరికీ నెలకు రూ.158.70 కోట్లు భృతి చెల్లించాల్సి వస్తోంది. జిల్లాలో మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో అత్యధికంగా నిరుద్యోగులు ఉన్నారు.

ఫీజురీయింబర్స్‌మెంట్‌ బకాయి ఏదీ?

దివంగత సీఎం వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి పేద విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఫీజు రీయింబర్స్‌మెంట్‌ పథకాన్ని అమలులోకి తెచ్చారు. 2014–19 మధ్య కాలంలో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. 2019 లో అధికారం చేపట్టిన వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి దానికి జవసత్వాలు తొడిగి గాడిలో పెట్టారు. 2024లో కూటమి సర్కార్‌ తుంగలో తొక్కేలా వ్యవహరిస్తోంది.

వైఎస్సార్‌సీపీ హయాంలో భరోసా

గత వైఎస్సార్‌సీపీ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి నిరుద్యోగులు, విద్యార్థులకు అండగా నిలిచారు. అమ్మఒడి పథకం ద్వారా గత ఐదేళ్లలో లక్షలాది మంది తల్లుల ఖాతాలకు రూ.529.83 కోట్ల నిధులు నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి జమ చేశారు. జగనన్న విద్యాదీవెన కింద ఏడాదికి 13,463 విద్యార్థులకు రూ.27.77 కోట్లు జమ చేశారు. వసతి దీవెన కింద ఏడాదికి 24.88 కోట్లు జమ చేశారు. నిర్ణీత గడువులోపు గత ప్రభుత్వం ఫీజులు చెల్లిస్తుండడంతో తల్లిదండ్రులు నిశ్చింతగా ఉండేవారు. ప్రస్తుత కూటమి సర్కార్‌లో ఆ విధానాన్ని అమలు చేయకపోవడంతో డ్రాపౌట్స్‌ సంఖ్య ఎక్కువగా కనిపిస్తోంది.

నేడు వైఎస్సార్‌సీపీ 'యువతపోరు'

యువత, విద్యార్థులను కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని ఎండగడుతూ వారి పక్షాన బుధవారం జిల్లా కేంద్రంలో 'యువతపోరు' నిర్వహించేందుకు వైఎస్సార్‌సీపీ శ్రీకారం చుట్టింది. ఈ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు యువతీయువకులు పార్టీ శ్రేణులతో కలసి నిరసన ర్యాలీలో పాల్గొనేందుకు సమాయత్తమయ్యారు. ఎన్నికల నాటి హామీని అమలు చేయాలని ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ఊరూవాడలోని యువత పయనమయ్యారు.

మోసం.. చంద్రబాబు నైజం



ఎన్నికల్లో విచ్చలవిడిగా హామీలు ఇచ్చి అధికారంలోకి రావటం..అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని విస్మరించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. రాష్ట్ర బడ్జెట్‌లో నిరుద్యోగ భృతికి కేటాయింపులు లేవు. ఉద్యోగ కల్పన లేక యువత అల్లాడిపోతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ నిధులు ఇవ్వక విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రజలు, యువత, విద్యార్థులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుంది.

– మెట్టు గోవిందరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త, రాయదుర్గం

నిరుద్యోగ భృతి ఇచ్చి తీరాలి



కూటమి ప్రభుత్వం యువత, విద్యార్థులను మోసం చేస్తోంది. ఇంటికో ఉద్యోగం అన్నారు. ఉద్యోగం రాకపోతే రూ.3 వేలు భృతి ఇస్తామని చెప్పి తొమ్మిది నెలలు గడిచిపోతున్నా పట్టించుకోలేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై నోరు మెదపలేదు. విద్యాదీవెన, వసతి దీవెన కోసం వేయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు.

– అరవింద్‌బాబు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు, రాయదుర్గం

యువత పోరుకు భారీగా తరలిరండి



కణేకల్లులో పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు



బ్రహ్మసముద్రంలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం



బెళుగుప్పలో మాట్లాడుతున్న నాయకులు

ఉరవకొండ: అనంతపురం కలెక్టరేట్‌ వద్ద బుధవారం జరిగే వైఎస్సార్‌ యువతపోరుర్యాలీకి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు, యువకులు తరలిరావాలని వైఎస్సార్‌ స్టూడెంట్‌ యూనియన్‌ నియోజకవర్గ అధ్యక్షుడు నవీన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ విద్యార్థి, యువజన విభాగం ఆధ్వర్యంలో యువత పోరు పోస్టర్లు విడుదల చేశారు. విద్యార్థి విభాగం అధ్యక్షుడు నవీన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ ఇవ్వకుండా ప్రభుత్వం ఇబ్బందులు గురి చేస్తోందన్నారు. కార్యక్రమంలో యువజన విభాగం రాష్ట్ర నాయకులు రాజేష్‌, విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్‌: అనంతపురంలో బుధవారం చేపట్టిన యువత పోరు ర్యాలీని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ ఆర్‌.రామాంజనేయులు ఓ ప్రకటనలో కోరారు. యువత పోరు కార్యక్రమానికి మండల వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యకర్తలు, యువత భారీగా సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కుందుర్పి: మండల కేంద్రంలో అనంతపురంలో బుధవారం జరగనున్న యువత పోరు పోస్టర్లను వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ హనుమంతరాయుడు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచు రామ్మూర్తి, వైస్‌ ఎంపీపీ భీమిరెడ్డి, ఎస్సీ సెల్‌ డివిజన్‌ అధ్యక్షులు తిప్పేస్వామి, ఎంపీటీసీ ఈరన్న, నరేష్‌ తదితరులు పాల్గొన్నారు.

వజ్రకరూరు: జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల కన్వీనర్‌ సోమశేఖర్‌ రెడ్డి, చాబాల సర్పంచు మల్లెల జగదీష్‌, యువజన విభాగం మండల అధ్యక్షుడు గోవర్ధన్‌ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో వారు మాట్లాడారు. ఈనెల 12న ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయం వద్దనున్న దివంగత సీఎం వైఎస్సార్‌ విగ్రహం నుంచి యువత పోరు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కణేకల్లులో పోస్టర్ల విడుదల

కణేకల్లు: జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించతలపెట్టిన 'యువతపోరు'కు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆలేరి రాజగోపాల్‌రెడ్డి పిలుపు నిచ్చారు. మంగళవారంకణేకల్లులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 'యువతపోరు' పోస్టర్లను జెడ్పీ సభ్యురాలు డి.పద్మావతి, జిల్లా ఉపాధ్యక్షులు మారెంపల్లి మారెన్న, కోశాధికారి పాటిల్‌ నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ పాటిల్‌ బ్రహ్మానందరెడ్డి, రాయదుర్గం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షులు ఉషారాణీలతో కలిసి ఆలేరి పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సర్పంచులు రామాంజనేయులు, భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల వైస్‌ కన్వీనర్‌ వేమన, మండల యూత్‌ వింగ్‌ అధ్యక్షులు కే.తేజ, నాయకులు ఆదినద్దురు చంద్రశేఖర్‌రెడ్డి, హళ్లినాగరాజు, చిన్న సర్మస్‌, బోయ నాగరాజు పాల్గొన్నారు.

శెట్టూరు: మండల కేంద్రంలో పార్టీ మండల కన్వీనర్‌ ఎమ్మెస్‌ రాయుడు, ఎంపీపీ సోమనాథ రెడ్డి పోస్టర్లు తదితరులు మంగళవారం యువతపోరు పోస్టర్లను విడుదల చేశారు.వారు మాట్లాడుతూ అనంతరపురం జిల్లా కేంద్రంలోని కలెక్టర్‌ కార్యాలయం వద్ద జరిగే ఈ కార్యక్రమానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. కార్యక్రమానికి నియోజవర్గ బూత్‌ కన్వీనర్‌ తిప్పేస్వామి, వైస్‌ ఎంపీపీ చెవుల కిష్టప్ప, శ్యామ్‌ సుందర్‌ చౌదరి, వీరాంజనేయులు, రామంజనేయులు, మిద్దె సుధాకర్‌, టైలర్‌ వన్నూరుస్వామి, లింగప్ప, బాలు, రాజశేఖర్‌ రెడ్డి, నంసింహ, మహ్మద్‌ రఫీ, బసంపల్లి నాగేంద్ర గొల్ల నాగేంద్ర, గోపి, మహేష్‌, గొల్ల కిష్టప్ప పాల్గొన్నారు.

విడపనకల్లు: యువతను నయవంచన చేసిన మోసం చేసిన కూటమి ప్రభుత్వంపై బుధవారం యువత పోరు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ కురుబ రమేష్‌, ఎంపీపీ కరణం పుష్పావతి, పార్టీ సీనియర్‌ నేత కరణం భీంరెడ్డి మంగళవారం తెలిపారు. మండల కేంద్రంలో పార్టీ కన్వీనర్‌ రమేష్‌ మాట్లాడుతూ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మండల కార్యదర్శి రాకెట్ల వన్నూరుస్వామి, మంతెప్ప, శివన్నరెడ్డి, మల్లి, వడుగూరు శేఖర్‌, పాలికి మారెన్న, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలో యువత పోరు కార్యక్రమ పోస్టర్లను మంగళవారం విడుదల చేశారు. ఈనెల 12న జిల్లా కేంద్రంలో జరిగే యువతపోరు ర్యాలీని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మహదేవప్ప, గోపాల్‌రెడ్డి, నియోజకవర్గ కార్మిక సంఘం అధ్యక్షుడు సంజీవయ్య, నియోజక వర్గ రైతు సంఘం అధ్యక్షుడు అభిలాష్‌ రెడ్డి, అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు సునితమ్మ, మండల యూత్‌ కన్వీనర్‌ రాము, ఎర్రిస్వామి, తిమ్మారెడ్డి, అయ్యన్న, గోవిందు, ఏసేప్‌, భాదపల్లప్ప, గంగాధర, నాగభూషణ, రాము, శంకర్‌నాయక్‌, మంజు, గోవింద, సునిల్‌, జానీ, నాగేంద్రబాబు, ఆటో ఆనంద్‌, ధనుంజయ, తిప్పేస్వామి, నటరాజ్‌, ప్రశాంత్‌, సోము, తదితరులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: జిల్లా కేంద్రంలో చేపట్టిన యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాటిల్‌ శ్రీనివాస్‌, ఏడీసీసీబీ మాజీ డైరెక్టర్‌ శివలింగప్ప, పార్టీ యువత మండల ఉపాధ్యక్షుడు సంతోష్‌రెడ్డి పిలుపునిచ్చారు. శ్రీనివాస్‌ గృహంలో పార్టీ మండల నాయకులతో కలిసి మంగళవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ యువత మండల ప్రధాన కార్యదర్శి పూలప్రసాద్‌, సెక్రటరీ సంతోష్‌ నాయక్‌, పార్టీ నాయకులు వెంకటేశులు, గాంగ్యానాయక్‌, పాతన్న, గురుమూర్తిరెడ్డి,నరిగన్న, శ్రీనివాస నాయక్‌, ఎం తిప్పేస్వామినాయక్‌, బి.తిప్పేస్వామినాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వసంతోత్సవం



చంద్రమౌళేశ్వర స్వామికి పూజలు నిర్వహిస్తున్న ఉత్తరాధికారి, మఠం సహాయ కమిషనర్‌

ఉరవకొండ: గవిమఠం చంద్రమౌళేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు మంగళవారం స్వామి వారి వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను గవిమఠంలో ఉన్న దిగుడు బావి వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లి వసంతోత్సవం నిర్వహించారు. అనంతరం కంకణ మంటపంలో ఉంచి నవ ధాన్యాలను బయటకు తీసి కంకణాలను బావిలో వదిలేశారు. అనంతరం ఆలయ అర్చకులు, గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్‌ కరిబసవ రాజేంద్రస్వామి, సహాయ కమిషనర్‌ రాణి ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వీరశైవ సంఘం నాయకులు పాటిల్‌ నిరంజన్‌గౌడ్‌ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు విజయవంతం

గవిమఠం బ్రహ్మోత్సవాలు పీఠాధిపతులు జగద్గురు చెన్నబసవ రాజేంద్రస్వామి ఆశీస్సులతో అన్ని శాఖల అధికారులు, పోలీసులు, గవిమఠం సిబ్బంది, భక్తులందరి సహకారంతో విజయవంతం అయినట్లు సహాయ కమిషనర్‌ కె.రాణి మంగళవారం తెలిపారు. చెన్నబసవరాజేంద్రస్వామి, ఉత్తరాధికారి డాక్టర్‌ కరిబసవ రాజేంద్రస్వామి సహాయ కమిషనర్‌ రాణిని సన్మానించారు. అసిస్టెంట్‌ కమిషనర్‌ మాట్లాడుతూ ఈనెల 9న జరిగిన మహా రథోత్సవం వేలాది మంది భక్తజనం మధ్య విజయవంతంగా పూర్తయ్యిందన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. బ్రహ్మోత్సవాలు విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

వైఎస్‌ జగన్‌ను కలిసిన కరణం రాహుల్‌



తాడేపల్లిలో వైఎస్‌ జగన్‌ను కలిసిన జిల్లా కార్య నిర్వహణ కార్యదర్శి కరణం రాహుల్‌

బ్రహ్మసముద్రం: నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌ సీపీ జిల్లా కార్య నిర్వహణ కార్యదర్శి కరణం రాహుల్‌ మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ను తాడేపల్లిలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైఎస్‌ జగన్‌ నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులను అడిగి తెలుకున్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

కళ్యాణదుర్గం రూరల్‌: నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య ఆధ్వర్యంలో బుధవారం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం పార్టీ కార్యాలయంలో పార్టీ జెండా ఆవిష్కరించనున్నారు. అనంతరం కూటమి ప్రభుత్వం తీరుతో నష్టపోతున్న విద్యార్థులు, యువతకు బాసటగా నిలిచేందుకు యువత పోరు నిరసన తెలియజేయనున్నారు.

ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని గౌరవించాలి

- విజిలెన్స్‌ మానిటరింగ్‌ కమిటీ సమావేశంలో ఆర్డీఓ వసంతబాబు



మాట్లాడుతున్న ఆర్డీఓ వసంతబాబు

కళ్యాణదుర్గం: ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఆర్డీఓ వసంతబాబు పేర్కొన్నారు. మంగళవారం కళ్యాణదుర్గంలోని రెవెన్యూ డివిజినల్‌ కార్యాలయంలో ఆర్డీఓ అధ్యక్షతన సాంఘిక/గిరిజన సంక్షేమ శాఖ, పౌరహక్కులు/అత్యాచార నిరోధక చట్టంపై డివిజినల్‌ స్థాయి మానిటరింగ్‌ కమిటీ సమావేశం జరిగింది. ఆర్డీఓ మాట్లాడుతూ మూడు నెలల క్రితం జరిగిన సమావేశంలో కమిటీ సభ్యులు లేవనెత్తిన పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. అనంతరం ప్రతి ఒక్కరూ విధిగా ప్రతి నెలా ప్రతి మండలంలో సివిల్‌ రైట్స్‌ డే నిర్వహించాలన్నారు. ఎక్కడైనా మండలాల్లో ఎస్సీ,ఎస్టీలకు అన్యాయం జరిగితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం కమిటీ సభ్యులు రామాంజనేయులు, మోహన్‌, హరీష్‌, కంబదూరు జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, ఎంపీపీలు మారుతమ్మ, భవాని పలు అంశాలను లేవనెత్తారు. ముద్దినాయనపల్లిలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఎస్టీ గురుకుల పాఠశాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నూతిమడుగు, కళ్యాణదుర్గం ఎస్టీ గురుకుల పాఠశాలల్లో తాగునీటి వసతికి ప్రత్యేక చొరవ చూపాలన్నారు. కళ్యాణదుర్గం ఫారెస్ట్‌ కార్యాలయంలో ఇన్‌చార్జ్‌ రేంజ్‌ ఆఫీసర్‌ ఎస్సీ,ఎస్టీ ఫారెస్ట్‌ వైల్డ్‌ వాచర్లతో వెట్టి చాకిరీ చేయిస్తున్నారని సభ్యుల దృష్టికి తీసుకువచ్చారు. హనిమిరెడ్డి పల్లి పెన్నా నదీ పరీవాహక ప్రాంతం నుంచి ఇసుక అక్రమ రవాణా దారులతో చేతులు కలిపి అక్రమంగా డబ్బులు వసూళ్లు చేస్తున్నారని తెలిపారు. డీఎస్పీ రవిబాబు మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీలకు సత్వర న్యాయం అందించడమే తమ లక్ష్యమని ఎక్కడైనా అన్యాయం జరిగితే నేరుగా తన వద్దకు రావాలని సూచించారు. డీఎల్డీఓ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి నెలా జరిగే సివిల్‌ రైట్స్‌ డేకు ఎంపీడీఓలు కానీ ఈఓఆర్డీలు కానీ తప్పక హాజరుకావాలన్నారు. డివిజన్‌ స్థాయిలోని తహసీల్దార్లు, సీఐ నీలంతేశ్వర, ఎంపీడీఓలు, ఏఎస్‌డబ్ల్యూఓలు దామోదర్‌రెడ్డి, రామ్మోహన్‌, వార్డెన్‌ నాగరాజు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ సౌజన్యంతో బస్‌ షెల్టర్‌ నిర్మాణం



మోపిడిలో మాట్లాడుతున్న డివిజనల్‌ మేనేజర్‌ రవికుమార్‌

ఉరవకొండ: మోపిడిలో ఎల్‌ఐసీ సౌజన్యంతో నిర్మించిన బస్‌షెల్టర్‌ను మంగళవారం ప్రారంభించారు. మోపిడిలో ఎల్‌ఐసీ 2024–25 ఆర్థిక సంవత్సరంలో 20 లక్షల ప్రీమియం సేకరించడంతో బీమా గ్రామంగా గుర్తింపు పొందింది. దీంతో కడప డివిజన్‌ ద్వారా గ్రామానికి రూ.లక్ష ఆర్థిక సహాయం అందింది. ఈనిధులను సర్పంచ్‌ మేకల సిద్దప్ప, ఉప సర్పంచ్‌ లాలెప్ప కోరిన మేరకు బస్‌ షెల్టర్‌ నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. కడప ఎల్‌ఐసీ డివిజనల్‌ మేనేజర్‌ ఆర్‌పీ రవికుమార్‌, గ్రామ సర్పంచ్‌ బస్‌షెల్టర్‌ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏజెంట్‌ గోపాల్‌, విస్తరణ అధికారి రాధిక, అనంతపురం శాఖాధికారి మధుబాబు, గుంతకల్లు బ్రాంచ్‌ శాఖ అధికారి మోహన్‌నాయక్‌ పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

బొమ్మనహాళ్‌: మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమా మంగళవారం తనిఖీ చేశారు. ఆమె 2024–25 సంవత్సర వార్షిక రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ప్రసాద్‌ పాల్గొన్నారు.

చిన్న వయసులో గర్భం దాలిస్తే ఆరోగ్య సమస్యలు

కూడేరు: బాల్యంలో గర్భం దాలిస్తే తల్లీబిడ్డకు ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని నియోజకవర్గ హెల్త్‌ ఎడ్యుకేటర్‌ ఎస్‌.ఎండీ షఫీ అన్నారు. మంగళవారం స్థానిక కేజీబీవీలో బాల్య వివాహాలు, బాల్యంలో గర్భం దాలిస్తే కలిగే అనర్థాలపై బాలికలకు వైద్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. హెల్త్‌ ఎడ్యుకేటర్‌ షఫీ మాట్లాడుతూ బాల్య వివాహాలతో బాలికల బంగారు భవిష్యత్‌ నాశనమవుతుందన్నారు. ఎస్‌ఓ ఉమాదేవి, ఎంఎల్‌హెచ్‌పీ కరీష్మా, ఏఎన్‌ఎంలు చంద్రకళ, సుశీల, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కళింగర పంట పరిశీలన

కూడేరు: మండలంలోని మరుట్ల–1 కాలనీకి చెందిన రైతు వెంకటేష్‌ పొలంలో దెబ్బతిన్న కళింగర పంటను హార్టికల్చర్‌ అధికారి నెట్టికంటయ్య, ఏఓ విజయ కుమార్‌ మంగళవారం పరిశీలించారు. నాసిరకం విత్తనాలతోనే పంట దెబ్బతిందని రైతు వెంకటేష్‌ అధికారుల దృష్టికి తీసుకుపోయారు. సుమారు రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లిందని వాపోయాడు. కార్యక్రమంలో వీఏఏ నారాయణమ్మ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఘనంగా మారెమ్మ జాతర

కుందుర్పి: మండలంలోని తూముకుంటలో మారెమ్మ జాతర మంగళవారం ఘనంగా జరిగింది. కర్ణాటక నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అనంతరం కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కలశాలను మారెమ్మ ఆలయంలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు.

నేటి నుంచి భంభంస్వామి ఉరుసు

రాయదుర్గంటౌన్‌: పట్టణంలోని సద్గురు భంభంబాబా దర్గాలో భంషేక్‌ అబ్దుల్‌ స్వాముల వారి 56వ ఉరుసు బుధవారం నుంచి ప్రారంభం కానుంది. మొదటిరోజు బుధవారం స్వామి వారి సందల్‌ ముబరాక్‌ (గంధం) ఉత్సవం, గురువారం శ్రీస్వాముల చిత్రపటం ఊరేగింపు, సాయంత్రం దర్గాలో చిరాఖేన్‌ (దీపారాధన), చివరి రోజు శుక్రవారం షంషీర్‌(బ్రహ్మోత్సవం), జియారత్‌, పౌర్ణమి, గురుపూజ పీఠాధిపతులచే ఆధ్యాత్మిక ఉపన్యాసం ఉంటుందని నిర్వాహకులు బషీర్‌ అహ్మద్‌, అబ్దుల్‌ వాహాబ్‌ తెలిపారు.

వర్మీకంపోస్టు ఎరువు తయారు చేయండి

కూడేరు: చెత్తతో సంపద తయారీ కేంద్రంలో అధికంగా వర్మీకంపోస్టు ఎరువును తయారు చేసి పంచాయతీకి ఆదాయం వచ్చేలా చూడాలని కొర్రకోడు సర్పంచ్‌ చంద్రశేఖర్‌ యాదవ్‌ అధికారులకు సూచించారు. మంగళవారం కొర్రకోడులోని చెత్తతో సంపద తయారీ కేంద్రంలో వర్మీకంపోస్టు ఎరువు తయారీ కోసం సర్పంచ్‌ వానపాములు వదిలారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్‌ జేఈ నాగదివ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటనారాయణ , పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

బందూరు–ఉద్దేహాళ్‌కు రోడ్డు నిర్మించాలి

రాయదుర్గంటౌన్‌: బొమ్మనహాళ్‌ మండలం బందూరు నుంచి ఉద్దేహాళ్‌కు రోడ్డు నిర్మించాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ డిమాండ్‌ చేశారు. 'బడికెళ్లాలి..రోడ్డు వేయండి' అని బందూరుకు చెందిన విద్యార్థులు పలకలపై రాసి రోడ్డుపై సోమవారం నిరసన తెలియజేశారు. బంగి శివ మాట్లాడుతూ బందూరు నుంచి ఉద్దేహాళ్‌కు 3.5 కిలోమీటర్ల మేర రోడ్డు అధ్వానంగా ఉందన్నారు. ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక రోజూ నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. విద్యాశాఖ, పంచాయతీ రాజ్‌శాఖ మంత్రులు, ఆర్టీసీ అధికారులు స్పందించి రోడ్డు నిర్మించి బస్సు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు.

పాల వ్యాను బోల్తా

కూడేరు: మండలంలోని ఉదిరిపికొండ వద్ద మంగళవారం పాల వ్యాన్‌ అదుపు తప్పి బోల్తా పడి పొలాల్లోకి దూసికెళ్లింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఉరవకొండ నుంచి అనంతపురం వెళ్తుండగా ప్రమాదం జరిగింది.

మహాధర్నాకు తరలిరండి

వజ్రకరూరు: ఉపాధి కూలీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఈనెల 12న విజయవాడలో తలపెట్టిన మహాధర్నాకు తరలిరావాలని సీపీఎం మండల కార్యదర్శి విరూపాక్షి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీని వాసులు పిలుపునిచ్చారు. మంగళవారం చిన్నహోతూరులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి, కూలీలతో మాట్లాడారు.